

జ్వరాలు, వ్యాధులు విజృంభణ

కోటవురట్ల సీహెచ్‌సీకి రోగుల తాకిడి

- రోజూ 300 మంది వరకు రాక
- ఇన్‌పేషెంట్ వార్డులో బెడ్‌లన్నీ ఫుల్



రోగులతో నిండిన ఇన్‌పేషెంట్ వార్డు



వైద్య సేవల కోసం క్యూలో నిల్చున్న రోగులు

కోటవురట్ల, సెప్టెంబరు 12:
స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోగుల తాకిడి పెరుగుతున్నది. ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించడం, తాగునీటి వనరులు కలుషితం కావడం, దోమల బెడద పెరగడంతో ప్రజలు పలు రకాల వ్యాధులు, జ్వరాల బారిన పడుతున్నారు. వైద్య సేవల కోసం సీహెచ్‌సీకి క్యూ కడుతున్నారు. దీంతో ఓపీ నమోదు పెరుగుతున్నది. పరిస్థితి తీవ్రంగా వున్న వారిని వార్డులో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఫలితంగా వార్డులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. సాధారణంగా ఈ ఆస్పత్రికి రోజూ 100 నుంచి 150 మంది వరకు రోగులు వస్తుంటారు. కానీ గత కొద్ది రోజుల నుంచి రోగుల రాక గణనీయంగా పెరిగింది. మంగళవారం 360 మంది, బుధవారం 300 మవతా, గురువారం 225 మంది రోగులు వచ్చారు. వీరిలో తీవ్ర జ్వరం, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారిని వార్డులో చేర్చి చికిత్స అందిస్తున్నారు. మొత్తం 50 పడకలు వుండగా, గురువారం అన్ని బెడ్లపై రోగులు వున్నారు. వీరికి సహాయంగా వచ్చిన కుటుంబ సభ్యులతో వార్డులు రద్దీగా మారాయి.



పసుపు కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న స్వయంభూ విఘ్నేశ్వరుడు

పసుపు కుంకుమ అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన గురువారంనాడు చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వరుడు పసుపు కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి పసుపు, కుంకుమతో స్వామిని ముస్తాబు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వయంభూ విఘ్నేశ్వరుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. - చోడవరం

అసంబద్ధంగా టీచర్ల సర్దుబాటు

- సరిపడ ఖాళీలు లేకపోవడంతో పలువురిని అక్కడే ఉంచేసిన అధికారులు
- మరోవైపు కౌన్సెలింగ్ ద్వారా యూపీ స్కూళ్లకు ఎస్‌జీటీల నియామకం
- పలు పాఠశాలల్లో గతంలో కన్నా అధికంగా టీచర్లు
- జిల్లాస్థాయి కౌన్సెలింగ్‌లో సర్దుబాటు చేసే అవకాశం

యూపీ స్కూళ్లలోని ఎస్‌ఏలను ఉన్నత పాఠశాలలకు పంపాలని విద్యా శాఖ ఆదేశాలు



నర్సీపట్నం మండలం ధర్మసాగరం ప్రాథమికోన్నత పాఠశాల

నర్సీపట్నం, సెప్టెంబరు 12:
ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో అదనంగా మిగిలిన స్కూల్ సిస్టెంట్ (ఎస్‌ఏ) ఉపాధ్యాయులను సర్దుబాటు చేయలేక విద్యా శాఖ అధికారులు మళ్లీ అవే పాఠశాలల్లో వుంచేశారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయడానికి ఖాళీలు లేకనే ఎక్కడి వారిని అక్కడ వుంచేశారని చెబుతున్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను అవసరం మేరకు ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేయాలని విద్యా శాఖ అధికారులు గత నెలలో ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ టీచర్లను ఈ నెల ఒకటో తేదీ నుంచి ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు ప్రక్రియ చేపట్టారు. తొలుత ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎస్‌జీటీలను నియమించారు. దీంతో ఆయా యూపీ పాఠశాలల్లో అదనంగా వున్న స్కూల్ అసిస్టెంట్ టీచర్ల సంగతి తేల్చ లేదు. జిల్లాస్థాయి కౌన్సెలింగ్ తర్వాత సర్దుబాటు చేస్తామని అధికారులు చెబుతున్నా.. ఎప్పుడు జరుగుందన్న దానిపై స్పష్టత లేదు.

ఉండాల్సి ముగ్గురు టీచర్లు.. ఉన్నది పది మంది!

నర్సీపట్నం మండలం ధర్మసాగరం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 88 విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఆరుగురు, ఒక ఎస్‌జీటీ కలిపి మొత్తం ఏడుగురు పని చేసేవారు. సర్దుబాటు ప్రక్రియలో హిందీ టీచర్ (స్కూల్ అసిస్టెంట్)ను నర్సీపట్నంలోని జడ్పీ ఉన్నత పాఠశాల (తురకబడి)కి పంపించారు. ఇక ధర్మసాగరంలో ఐదుగురు స్కూల్ అసిస్టెంట్ టీచర్లు, ఒక ఎస్‌జీటీ మిగిలారు. ఇదే సమయంలో కొత్తగా నలుగురు ఎస్‌జీటీలను ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ఈ పాఠశాలలో నియమించారు. ప్రస్తుతం ధర్మసాగరం యూపీ పాఠశాలలో ఐదుగురు స్కూల్ అసిస్టెంట్ టీచర్లు, ఐదుగురు ఎస్‌జీటీలు ఉన్నారు. విద్యా శాఖ లెక్కల ప్రకారం ఇక్కడ ఐదుగురు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మిగిలిపోయాయి. నూతన విద్యా విధానం ప్రకారం ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలి. ధర్మసారం పాఠశాలలో 88 మంది మాత్రమే విద్యార్థులు వున్నందున ముగ్గురు ఎస్‌జీటీలు సరిపోతారు. కానీ స్కూల్‌అసిస్టెంట్ ఉపాధ్యా యు లు ఐదుగురు, ఎస్‌జీటీలు ఇద్దరు అదనంగా వున్నారు. ముగ్గురు ఉపాధ్యా యులు సరిపోయే పాఠశాలలో పది మంది టీచర్లు వుండడం గమనార్హం.

గురందొరపాలెం స్కూల్లో అదనంగా ఐదుగురు..!

నర్సీపట్నం మండలం గురందొరపాలెం యూపీ పాఠశాలలో 78 మంది విద్యార్థులు వున్నారు. ఇక్కడ ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లు, ఇద్దరు ఎస్‌జీటీలు పని చేసేవారు. సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఇంగ్లిషు, తెలుగు ఎస్‌ఏలను నర్సీపట్నం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు పంపించారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ముగ్గురు ఎస్‌జీటీలను గురందొరపాలెంలో నియమించారు. దీంతో ఆ పాఠశాలలో ఐదుగురు ఎస్‌జీటీలు, ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు కలిపి మొత్తం ఎనిమిది మంది టీచర్లు పని చేస్తున్నారు. నూతన విద్యా విధానం ప్రకారం ఈ పాఠశాలకు ముగ్గురు ఎస్‌జీటీలు సరిపోతారు. కానీ ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు, ఇద్దరు ఎస్‌జీటీలు అదనంగా వున్నారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉందని ఉపాధ్యాయులు అంటున్నారు. ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ ఖాళీ పోస్టులు లేకనే ఎక్కడివారిని అక్కడ ఉంచేశారని చెబుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో తలుపులుని వివరణ కోరగా.. జిల్లాస్థాయి కౌన్సెలింగ్‌లో సర్దుబాటు చేస్తారని చెప్పారు.

అదృశ్యమైన ఫార్మా ఉద్యోగి మృతి

'అడ్మిరాన్' పరిశ్రమ మిథనాల్ ట్యాంక్‌లో శవమై తేలిన సూర్యనారాయణ

- యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకుల ఆరోపణ
- రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్
- మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించొద్దని గేటు ఎదుట బైఠాయింపు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన
- యాజమాన్య ప్రతినిధులతో కుటుంబ సభ్యులు, రాజకీయ నేతల చర్చలు
- రూ.50 లక్షలు ఇవ్వడానికి యాజమాన్యం అంగీకారం
- ఆందోళన విరమణ, మృతదేహం పోస్టుమార్టానికి తరలింపు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



మృతుడు సూర్యనారాయణ (ఫైల్ ఫొటో)



సూర్యనారాయణ శవమై తేలిన మిథనాల్ ట్యాంకు ఇదే

పరవాడ, సెప్టెంబరు 12:
ఫార్మాసిటీలోని అడ్మిరాన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం అదృశ్యమైన ఆర్.సూర్యనారాయణ(40) పరిశ్రమ ఆవరణలోని మిథనాల్ ట్యాంక్‌లో శవమై తేలాడు. ఈ విషయాన్ని గురువారం ఉదయం యాజమాన్యం గుర్తించింది. ప్రమాదవశాత్తూ మృతిచెందాడా? లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అన్నది ఇంకా నిర్ధారణ కాలేదు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

అడ్మిరాన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆర్.సూర్యనారాయణ మంగళవారం జనరల్ షిఫ్ట్‌లో విధులకు హాజరయ్యాడు. సాయంత్రం ఐదు గంటలకు విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరాల్సి వుంది. కానీ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు బుధవారం ఉదయం పరిశ్రమ వద్దకు వచ్చి వాకబు చేశారు. ఎక్కడా ఆచూకీ లభించలేదు. విధులు ముగిసిన తరువాత పరిశ్రమ నుంచి బయటకు వెళ్లినట్టు సీసీ కెమెరా ఫుటేజీలో కనిపించలేదు. దీంతో కుటుంబీకులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరిశ్రమలోని ఉద్యోగులంతా గురువారం ఉదయం మరోసారి సూర్యనారాయణ కోసం అన్ని విభాగాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మిథనాల్ ట్యాంకు పైకి ఎక్కి చూడగా అందులో సూర్యనారాయణ మృతదేహం కనిపించింది. 20 కేఎల్ సామర్థ్యం కలిగిన ... మిగతా 8వ పేజీలో



రోదిస్తున్న సూర్యనారాయణ కుటుంబ సభ్యులు

కిరండోల్ రైళ్లకు అదనపు విస్టాడోమ్, ఏసీ కోచ్



విశాఖపట్నం, సెప్టెంబరు 12: పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ, కిరండోల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్లకు అదనంగా ఒక విస్టా డోమ్ కోచ్, థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లను జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ నెల 14, 21, 28 తేదీల్లో (ప్రతి శనివారం) విశాఖ నుంచి కిరండోల్ వెళ్లే 08551 నంబరు గల రైలుకు, తిరుగు ప్రయాణంలో ఈ నెల 15, 22, 29 తేదీల్లో (ప్రతి ఆదివారం) కిరండోల్ నుంచి విశాఖ వచ్చే 08552 నంబరు గల రైలుకు ఒక విస్టా డోమ్ కోచ్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఈ నెల 15, 22, 29 తేదీల్లో విశాఖ నుంచి కిరండోల్ వెళ్లే 08551 నంబరు గల రైలుకు, తిరుగు ప్రయాణంలో ఈ నెల 16, 23, 30 తేదీల్లో కిరండోల్ నుంచి విశాఖ వచ్చే 08552 నంబర్ గల రైలుకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తున్నామని తెలిపారు.

నరక ప్రయాణం

మాడుగుల మండలంలో తీవ్రంగా దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు

- కేజేపురం జంక్షన్ నుంచి ఎం.కె.వల్లాపురం వరకు భారీ గోతులు
- ప్రమాదాలబారిన వాహనదారులు





ఎం.కె.వల్లాపురం వద్ద పూర్తిగా ధ్వంసమైన రోడ్డు. (ఇన్‌సెట్‌లో) వాహనదారుల పాట్లు!

మాడుగుల రూరల్, సెప్టెంబరు 12:
వడ్డాది-పాడేరు ఆర్‌అండ్‌బీ రోడ్డు మాడుగుల మండల పరిధిలో పలుచోట్ల భారీ గోతులు ఏర్పడి తీవ్రంగా దెబ్బతిన్నది. ముఖ్యంగా కేజేపురం జంక్షన్ నుంచి ఎం.కోటపాడు మీదుగా ఎం.కె.వల్లాపురం వరకు పలుచోట్ల ఛిద్రమై అధ్వానంగా వుంది. ఈ ఏడాది మార్చి నెలలో అప్పటి మంత్రి, స్థానిక ఎమ్మెల్యే అయిన బూడి ముత్యాలనాయుడు చొరవ తీసుకుని కొన్నిచోట్ల మరమ్మతులు చేయించారు. కానీ పనుల్లో నాణ్యత లేకపోవడంతో వర్షాలకు దెబ్బతిన్నది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. గోతుల్లో నీరు నిలిచిపోయి, వాహనాల రాకపోకలతో మరింత పెద్దవయ్యాయి. ఆరు నెలలు తిరగకుండానే రోడ్డు పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది. గోతులు కప్పడానికి అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలబారిన పడుతున్నామని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. ఇరువైపులా రహదారికన్నా ఎక్కువ ఎత్తులో మట్టి పేరుకుపోవడంతో రోడ్డుపై కురిసిన వర్షం నీరు పక్కకు వెళ్లడానికి వీలులేకపోయిందని, దీంతో రోడ్డు త్వరగా పాడైపోతున్నదని స్థానికులు అంటున్నారు. కాగా రహదారి దుస్థితిపై ఆర్‌అండ్‌బీ మాడుగుల ఏఈ సాయి శ్రీనివాసునిఇ వివరణ కోరగా.. వడ్డాది నుంచి తాటిపర్తి వరకు ఎన్‌డీబీ నిధులు రూ.25 కోట్లతో రహదారిని ఏడు మీటర్ల మేర వెడల్పు చేసి తారు రోడ్డు వేసేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు. గోతులు ఏర్పడినచోట మరమ్మతులు చేపడతామని తెలిపారు.

సీపీ X డీఐజీ

సీఐల బదిలీ ప్రక్రియపై భేదాభిప్రాయాలు

- నగర పోలీస్ కమిషనర్ పీఈజీ ఆమోదం తీసుకోలేదని వాదన
- నగరంలో పోస్టింగ్ వచ్చిన చేరని కొంతమంది ఇన్‌స్పెక్టర్లు
- ఆయా జిల్లాల్లో రిలీవ్ చేయకపోవడమే కారణం
- డీఐజీ అనుమతించలేదని ప్రచారం

- 7లో



కల్యాణపులోవ గేట్ల నుంచి సర్పా నదిలోకి విడుదల చేస్తున్న నీరు

కల్యాణపులోవకు కొనసాగుతున్న వరద

- రెండు గేట్లు ఎత్తిన అధికారులు
- అదనపు నీరు దిగువకు విడుదల

రావికమతం, సెప్టెంబరు 12:
ఏజెన్సీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో మండలంలోని కల్యాణపులోవ రిజర్వాయర్‌లోకి మళ్లీ వరద నీరు చేరుతున్నది. గురువారం 120 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుండగా, రెండు గేట్లు ఎత్తి వంద క్యూసెక్కుల నీటిని దిగువకు పెడుతున్నామని జేఈ సత్యనారాయణ దొర తెలిపారు.

గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులుకాగా 459 అడుగుల వద్ద నీటి నిల్వలను స్థిరంగా వుంచుతూ, అదనపు నీటిని సర్పా నదిలోకి విడుదల చేస్తున్నట్టు ఆయన చెప్పారు.



జోలాపుట్టు వద్ద దెబ్బతిన్న వంతెనను పరిశీలిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే మత్స్యలింగం

జోలాపుట్టు వంతెన మరమ్మతుకు
జిల్లా పరిషత్ నిధులు

» రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానని చైర్‌పర్సన్ సుభద్ర వెల్లడి

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 12: జోలాపుట్టు జలాశయం వరద ఉధృతికి దెబ్బతిన్న ఆంధ్రా, ఒడిశాలను కలిపే జోలాపుట్టు సరిహద్దు వంతెన మరమ్మతు పనులకు జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయనున్నట్టు ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర హామీ ఇచ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జోలాపుట్టు జలాశయం నుంచి నీటినిఇ విడుదల చేయడంతో దిగువన ఉన్న వంతెన ముందు భాగం దెబ్బతిన్న విషయం తెలిసిందే. దీనిని జడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం గురువారం పరిశీలించారు. వంతెన దెబ్బతినడంతో ఆటుఇటు రాకపోకలు సాగించే ఇరురాష్ట్రాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మూడు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తున్నదని స్థానికులు చెప్పారు. దీంతో స్పందించిన ఆమె జడ్పీ నిధులతో తాత్కాలిక మరమ్మతు పనులు చేయిస్తామనని చెప్పారు. వంతెన సమస్యను జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోల దృష్టికి తీసుకువెళ్లి పూర్తిస్థాయిలో మరమ్మతులు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం జోలాపుట్టు జలాశయాన్ని సందర్శించారు. రిజర్వాయర్ నుంచి అధికమొత్తంలో నీటిని విడుదల చేసేటప్పుడు పరివాహక ప్రాంతాల ప్రజలకు సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఎంపీపీ ఎ.సీతమ్మ, వైస్‌ఎంపీపీ ఎస్.భాగ్యవతి, సర్పంచులు నీలకంఠం, రమేశ్, గంగాధర్, నరసింగరావు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సింహాచలంలో తిరు పవిత్రోత్సవాలు

» రాత్రి ఏడు గంటల వరకే భక్తులకు అప్పన్న దర్శనాలు

» ఈనెల 17 వరకు ఆర్జిత సేవలు రద్దు



ఉత్సవంలో వినియోగించనున్న పవిత్రాలు

సింహాచలం, సెప్టెంబరు 12: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరిగే నిత్య, వార, పక్ష, మాస, వార్షిక ఉత్సవాల్లో వైదిక సిబ్బంది లేదా అధికారులు తెలిసో తెలియకో చేసే దోషాల నివృత్తికి శుక్రవారం నుంచి తిరు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడాది పొడవునా జరిగిన పలు ఉత్సవాల్లో మంత్రం, క్రియ, ద్రవ్యం, భక్తి, శ్రద్ధ విధానాల్లో జరిగిన దోషాల నివృత్తికి ఏటా భాద్రపద మాస శుక్లపక్ష దశమి నుంచి ఐదు రోజులు తిరుపవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈమేరకు దశమి రోజున అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టి, పవిత్రాధివాసం, పవిత్ర సమర్పణ, పవిత్ర విసర్జన, ఏకాంత స్నపన తిరుమంజాలను నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక హోమాలను ఉభయ సంధ్యలను, చతుర్వేద, ఇతిహాస, పురాణాల పారాయణలు నిర్వహించి త్రయోదశి రోజున మహా పూర్ణాహుతి జరుపుతామన్నారు. కాగా ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 14 నుంచి 17 వరకు స్వామివారి ఆర్జిత సేవలను రద్దు చేశామని, రాత్రి 7 గంటల వరకే భక్తులకు దర్శనాలు లభిస్తాయని అధికారులు ప్రకటించారు.

పూర్వ విద్యార్థులకు సత్కారం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించిన దృశ్యం

ఎలమంచిలి, సెప్టెంబరు 12: సీయూఈటీ(పీజీ)లో ప్రతిభ కనబరిచి వివిధ యూనివర్సిటీల్లో చేరిన గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ గురువారం సత్కరించారు. ఈ కళాశాలలో చదివిన 52 మందిని ఎంపిక చేసి ఏకలవ్య చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో వారికి అవార్డులు, నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామారావు, అధ్యాపకులు జగ్గారావు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

స్కూటీ డిక్కీలో కింగ్‌కోబ్రా.. హతమార్చిన స్థానికులు



హతమైన కింగ్‌కోబ్రా

అనంతగిరి, సెప్టెంబరు 12: మండల కేంద్రంలో ఓ ఇంటిముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం(స్కూటీ) డిక్కీలోకి 15 అడుగుల కింగ్‌కోబ్రా పాము దూరింది. దీనిని గమనించిన స్థానికులు కర్రలతో పామును హతమార్చారు. ఇటీవల అనంతగిరి పీహెచ్‌సీ సమీపంలో20 అడుగుల కింగ్‌కోబ్రా కనిపించింది. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

విశాఖ రైల్వే స్టేషన్‌కు ఎన్ఎస్‌జీ-1 గుర్తింపు

» ప్రతిపాదించిన కేంద్ర రైల్వే బోర్డు

» ఆమోదం లభిస్తే మరిన్ని ఆధునిక వసతులు, సౌకర్యాలు, రైళ్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను నాన్ సబర్బన్ గ్రూపు (ఎన్ఎస్‌జీ)-1లో చేర్చాలని కేంద్ర రైల్వే బోర్డు తాజాగా ప్రతిపాదించింది. ప్రస్తుతం విశాఖపట్నం స్టేషన్ ఎన్ఎస్‌జీ-2లో ఉంది. ఏడాదికి రూ.500 కోట్లకు పైగా ఆదాయం, రెండు కోట్ల మంది ప్రయాణిస్తే ఆ స్టేషన్‌ను ఎన్ఎస్‌జీ-1లో చేరుస్తారు. విశాఖ రైల్వేస్టేషన్ 2023-24లో గణనీయమైన ప్రగతిని సాధించింది. స్టేషన్ ఆదాయం రూ.5,641.66 కోట్లు కాగా అందులో రిజర్వ్‌డ్ ప్రయాణికుల నుంచే రూ.678.81 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ తరహా ఆదాయం చాలా కాలంగా వస్తున్నా ప్రయాణికుల సంఖ్య రెండు కోట్లకు చేరలేదనే కారణంతో ఇప్పటివరకూ దీనిని ఎన్ఎస్‌జీ-2లో కొనసాగిస్తున్నారు. భువనేశ్వర్ కేంద్రంగా పనిచేస్తున్న తూర్పు కోస్తా జోన్‌లో ఎక్కువ ఆదాయం సాధించే స్టేషన్లు 20 వరకు ఉండగా వాటన్నింటిలో విశాఖపట్నమే మొదటి స్థానంలో నిలుస్తోంది. ఈ ఆదాయం ఇంకా పెరిగే అవకాశం ఉండడంతో రైల్వే బోర్డు ఎన్ఎస్‌జీ-1లో చేర్చాలని ప్రతిపాదించింది.

ఏమిటి ప్రయోజనం?

ఎన్ఎస్‌జీ-2 నుంచి 1కి మారడం వల్ల ఏమిటి ప్రయోజనం అనే ప్రశ్న సాధారణంగా వినిపిస్తుంది. అలా మారిస్తే ఆ స్థాయికి తగినట్టుగా స్టేషన్‌ను అభివృద్ధి చేస్తారు. అధునాతన వసతులు కల్పిస్తారు. ప్రయాణికులకు ఇంకా మెరుగైన సదుపాయాలు అందుతాయి. వాణిజ్య పరంగా అభివృద్ధి చేస్తారు. డిమాండ్‌కు తగిన రైళ్లను నడుపుతారు. రైల్వే బోర్డు ప్రతిపాదనపై అధికార వర్గాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

సెజ్ ఏర్పాటుతో యువతకు ఉపాధి

» ఎమ్మెల్యే బండారు

» కలెక్టర్‌తో కలిసి ఆర్లి, గుల్లేపల్లి గ్రామాల్లో భూములు పరిశీలన

» సానుకూలంగా స్పందించిన రైతులు



ఎస్ఈజడ్ ఏర్పాటుకు భూసేకరణ జరిపే ప్రాంతం మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు, కలెక్టర్ విజయకృష్ణన్, తదితరులు

కె.కోటపాడు, సెప్టెంబరు 12: ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజడ్-సెజ్) ఏర్పాటుతో ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోవడమే కాకుండా పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం మండలంలోని ఆర్లి, గుల్లేపల్లి గ్రామాల మధ్య ఉన్న ప్రభుత్వ భూములను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి పరిశీలించారు. రెవెన్యూ అధికారులు సమర్పించిన భూముల వివరాలపై పరిశ్రమల ఏర్పాటుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉందా? లేదా? అని జిల్లా కలెక్టర్ వాకబు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎస్ఈజడ్ ఏర్పాటుపై భూముల యజమానుల అభిప్రాయాలను ఆమె కోరగా, హానికారక పరిశ్రమలు తప్ప మిగిలినవి ఏవైనా తమకు అభ్యంతరం లేదని బదులిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ, ఎస్ఈజడ్‌కు అవసరమైన వెయ్యి ఎకరాలు ఇక్కడ అందుబాటులో వున్నాయని, అదనపుంగా భూమి కావాలంటే సేకరించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి విశాఖజిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా మాడుగుల నియోజకవర్గాన్ని ప్రభుత్వం గుర్తించిందని, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ సహకారంతో ఈ నియోజకవర్గంలో రెండు ఎస్ఈజడ్‌లు ఏర్పాటు అవుతాయని చెప్పారు. ఎస్ఈజడ్‌లో పరిశ్రమల ఏర్పాటుతో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు సమకూరతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత పైలా ప్రసాదరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జి రాయప రెడ్డి కృష్ణ, ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీడీవో అప్పలరాజు, మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోతులమయంగా ఉన్న అసకపల్లి - లంకెలపాలెం రోడ్డు





అధ్వాన రహదారితో అవస్థలు

» అడుగుకో గొయ్యి ఉండడంతో వాహనచోదకుల పాట్లు

పరవాడ/సబ్బవరం, సెప్టెంబరు 12: అసకపల్లి - లంకెలపాలెం రోడ్డులో అడుగుకో గొయ్యి ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల నిర్వహణను గాలికి వదిలేయడంతో ఈ పరిస్థితి నెలకొందని వాహనచోదకులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రయాణమంటే వాహనచోదకులు హడలెత్తిపోతున్నారు. కారుల్లో ప్రయాణించే వారు ప్రత్యామ్నాయంగా లంకెలపాలెం నుంచి అనకాపల్లి మీదుగా సబ్బవరం చేరుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి అసకపల్లి - లంకెలపాలెం రోడ్డును బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

వీఎంఆర్డీఏ ప్రతిపాదిత రహదారుల పరిశీలన



అచ్యుతాపురంలో పర్యటిస్తున్న కేఎస్ విశ్వనాథన్

అచ్యుతాపురం, సెప్టెంబరు 12: వీఎంఆర్డీఏ ప్రతిపాదిత బృహత్ ప్రణాళిక రహదారులను వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వీఎంఆర్డీఏ ప్రతిపాదించిన నాతయ్యపాలెం నుంచి చుక్కవానిపాలెం వరకు వంద అడుగుల రోడ్డు, వీకేపీసీపీఐఆర్, వుడా ప్రతిపాదిత పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ నుంచి అచ్యుతాపురం వరకు 200 అడుగులు, అచ్యుతాపురం- గాజువాక ప్రధాన రహదారిలో గల అప్పన్నపాలెం నుంచి పూడిమడక రోడ్డులో గల సెజ్ ముఖద్వారం వరకు వంద అడుగుల బృహత్ ప్రణాళిక రహదారిని పరిశీలించారు. అచ్యుతాపురం సెజ్‌లో పరిశ్రమల సౌలభ్యం కోసం రద్దీ నియంత్రణలో భాగంగా విస్తరణ చేపట్టవలసిన పలు రహదారులను కూడా ఆయన పరిశీలించారు. అచ్యుతాపురం జంక్షన్ అభివృద్ధి, విస్తరణ పనుల విషయాలను రోడ్లు, భవనాల శాఖ అధికారులతో చర్చించారు. ప్రతిపాదిత రోడ్లకు ఆర్డీపీ (రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్)లను, అంచనాలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, వీకేపీసీపీఐఆర్- వుడా జాయింట్ డైరెక్టర్ శిల్పా, ప్లానింగ్ అధికారి చైతన్య, డీఈ రవిశంకర్, ఆర్ అండ్ బీ డీఈ విద్యాసాగర్, ఏఈఈ ఆంజనేయరాజు, తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ సర్వేను అడ్డుకున్న రైతులు

» భూములకు ప్రస్తుత ధర ఇవ్వాలని డిమాండ్



దొప్పెర్లలోని దుర్గా దేవి ఆలయంలో సమావేశమైన రైతులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 12: బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) ఉద్యోగుల రెసిడెన్షియల్ కాలనీకి అవసరమైన భూమి సర్వేను దొప్పెర్ల గ్రామస్థులు గురువారం అడ్డుకున్నారు. దీనిపై నిర్వాసిత రైతులంతా దొప్పెర్ల దుర్గాదేవి ఆలయంలో సమావేశమై తమ డిమాండ్లు అంగీకరించిన తర్వాతే సర్వే జరపాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. దీంతో సర్వే చేయడానికి వచ్చిన అధికారులు వెనుదిరిగారు. బార్క్ ఉద్యోగుల నివాసిత కాలనీకి దొప్పెర్ల సర్వే నంబర్లు 99, 159, 164, 165, 168, 169, 170లలో సుమారు 91.33 ఎకరాల భూమిని సేకరించాలని ఏపీఐఐసీ నిర్ణయించింది. ఈ భూముల కోసం ఆగస్టు 2010లోనే నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే అప్పటి నుంచి భూమికి ధర ప్రకటించలేదు, స్వాధీనం చేసుకోలేదు. రైతులు ఇంతవరకు సాగుచేసుకుంటున్నారు. ఈ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని అధికారులు సర్వే ప్రారంభించారు. ఈ మేరకు గత ఆరు నెలల నుంచి సర్వే అధికారులు వస్తున్నారు, రైతులు అడ్డుకుంటున్నారు. అదే విధంగా గురువారం కూడా సర్వే అధికారులు వచ్చారు. మళ్లీ రైతులు అడ్డుకున్నారు. ఈ భూములకు 2010లో నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ఇప్పటి ధరల ప్రకారం పరిహారం ఇవ్వాలని, నిర్వాసితులకు తప్పనిసరిగా బార్క్‌లో ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ముందుగా తమ డిమాండ్లు అంగీకరించిన తరువాతే సర్వేకి రావాలని రైతులు కోరారు. దీనిపై సర్వే అధికారిణి జె.రాధకు వినతి పత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఆమె రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొరుప్రోలు చిన్నారావు, ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పల్లి శేషగిరిరావు, కొల్లి వరహాల రావు, పల్లి సత్యారావు, లాలం లావణ్య, కొరుప్రోలు శ్రీనివాసరావు, వర్రె అప్పారావు, కొల్లి రామారావు, బి. బాపు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేత సీతారాం ఏచూరికి నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, కమ్యూనిస్టు మేధావి సీతారాం ఏచూరి మృతికి ఆ పార్టీ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీపీఎం కార్యాలయంలో మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు జి.కోటేశ్వరరావులు గురువారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, అల్లు రాజు, ఉమామహేశ్వరరావు, సుజాత, సుభాషిణి పాల్గొన్నారు.

సీపీ X డీఐజీ

» సీఐల బదిలీ ప్రక్రియపై భేదాభిప్రాయాలు

» నగర పోలీస్ కమిషనర్ పీఈబీ ఆమోదం తీసుకోలేదని వాదన

» నగరంలో పోస్టింగ్ వచ్చినా చేరని కొంతమంది సీఐలు

» ఆయా జిల్లాల్లో రిలీవ్ చేయకపోవడమే కారణం

» డీఐజీ అనుమతించలేదని ప్రచారం

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టికి మధ్య కోల్డ్‌వార్ నడుస్తోందనే చర్చ పోలీస్ వర్గాల్లో సాగుతోంది. ఇరువురు అధికారుల మధ్య ఏర్పడిన విభేదాలు ఇటీవల నగర పరిధిలో సీపీ చేపట్టిన సీఐల బదిలీల అనంతరం తారస్థాయికి చేరినట్టు ప్రచారం జరుగుతోంది.

ఇటీవల సీపీ శంఖబ్రత బాగ్చి మూడు విడతల్లో 52 మంది సీఐలను బదిలీ చేయడం/పోస్టింగ్ ఇవ్వడం చేశారు. ఆ సమయంలో సీపీ నిబంధనలకు విరుద్ధంగా రేంజ్ పరిధిలోని సీఐలకు నగరంలో పోస్టింగ్‌లు ఇచ్చారని డీఐజీ అభ్యంతరం వ్యక్తంచేసినట్టు తెలిసింది. సాధారణంగా విశాఖ రేంజ్ పరిధిలో ఎస్ఐ ఉద్యోగాల అపాయింట్‌మెంట్ అథారిటీగా డీఐజీ వ్యవహరిస్తారు. ఎస్ఐలను జిల్లాలకు కేటాయించిన తర్వాత వారికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలనేది సంబంధిత జిల్లా ఎస్పీ విచక్షణపై ఆధారపడి ఉంటుంది. అదే మాదిరిగా సీఐల బదిలీ నగర పోలీస్ కమిషనరేట్ మినహా విశాఖ రేంజ్ పరిధిలో డీఐజీ విచక్షణపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న సీఐలను నగర పోలీస్ కమిషనరేట్‌కు తీసుకోవాలని సీపీ భావిస్తే పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు (పీఈబీ) ఆమోదం తప్పనిసరి. నగరానికి ఎవరెవరిని తీసుకోవాలనుకుంటున్నారనే జాబితాను సీపీ...రేంజ్ డీఐజీకి పంపిస్తే ఆయన వారిని రేంజ్ నుంచి సిటీ వీఆర్‌కు బదిలీ చేస్తారు. సిటీ వీఆర్‌కు వచ్చిన తర్వాత ఎక్కడ ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలనే దానిపై సీపీకి మాత్రమే విచక్షణాధికారం ఉంటుంది. అలాగే సిటీ నుంచి రేంజ్‌కు బదిలీ చేయాలనుకుంటే సీపీ వారిని వీఆర్‌కు మాత్రమే సరండర్ చేయాలి. అక్కడ నుంచి డీఐజీ వారి సేవలను ఎక్కడెక్కడ వాడుకోవాలనేది నిర్ణయించుకుంటారు. ఇదిలావుంటే నగర పరిధిలో జరిగిన గత మూడు దశల సీఐల బదిలీలు/పోస్టింగ్‌ల ప్రక్రియలో మొదటి రెండు దశలకు సంబంధించి సీపీ సీఐలను బదిలీ చేసినప్పుడు పీఈబీ ఆమోదం తీసుకోలేదని పోలీస్ అధికారులు కొందరు చెబుతున్నారు. రేంజ్ పరిధిలో పనిచేస్తున్న వారిలో నిజాయితీపరులు, సమర్థులుగా గుర్తింపు ఉన్న సీఐలను సీపీ నగరానికి తీసుకున్నారు. ఈ క్రమంలో కొందరు ప్రజా ప్రతినిధులను సిఫారసులను సైతం సీపీ పక్కనపెట్టారంటూ రాజకీయ వర్గాల్లో దుమారం రేగింది. నగరంలో పోలీసింగ్‌ను బలోపేతం చేయడమే తన లక్ష్యమని, మరో ఆలోచనకు తావు ఉండకూడదనే పారదర్శకంగా బదిలీలు చేపట్టానంటూ సీపీ కొందరు అధికారుల వద్ద అభిప్రాయపడినట్టు తెలిసింది. ఇదిలావుండగా రేంజ్‌లో పనిచేస్తూ సిటీకి బదిలీ అయిన సీఐలు కొందరు ఇప్పటికీ తమ కొత్త పోస్టింగ్‌లలో చేరలేదు. ఇప్పుడు పనిచేస్తున్న స్థానం నుంచి వారిని డీఐజీ రిలీవ్ చేయడానికి నిరాకరించడమే దీనికి కారణమంటూ ప్రచారం జరుగుతోంది. సీఐల బదిలీల అంశం ఇప్పటికే డీజీపీ ద్వారకా తిరుమలరావు దృష్టికి చేరినట్టు పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా సీపీ, డీఐజీల మధ్య తలెత్తిన విభేదాలు తమకు సమస్యగా పరిణమించాయంటూ నగర పరిధిలో పోస్టింగ్‌లు దక్కించుకున్న సీఐలు వాపోతున్నారు.

రేపటి నుంచి సీపీఎం బైక్ యాత్ర



పోస్టర్లను ఆవిష్కరించిన సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12: జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు సీపీఎం ఆధ్వ ర్యంలో బైక్ యాత్ర నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం బైక్‌యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ 14న పాయకరావుపేట నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలో గత 25 ఏళ్లుగా జరిగిన పారిశ్రామిక ప్రమాదాల్లో ఎసెన్షియా ఫార్మాలో జరిగిన ప్రమాదం అతి పెద్దదని తెలిపారు. కంపెనీ నిర్లక్ష్యం వల్ల 17 మంది కార్మికులు మృతి చెందారన్నారు. రాష్ట్రంలో ఇటీవల వివిధ పరిశ్రమల్లో 120 ప్రమాదాలు జరిగి 140 మంది మృతి చెందగా, అనకాపల్లి జిల్లాలోనే ఆరేళ్లలో 54 కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో 62 మంది మృతి చెందగా, 92 మంది తీవ్ర గాయాలపాలయ్యారన్నారు. పరిశ్రమల్లో కార్మికుల భద్రత, ప్రభుత్వాల పటిష్ఠ చర్యలకు సీపీఎం నిర్వహిస్తున్న యాత్రలో కార్మికులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.కోటేశ్వరరావు, ఆర్.శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, అల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో ఎయిడ్స్ నివారణ సాధ్యం



బ్రోచర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12: సంపూర్ణ అవగాహనతో ఎయిడ్స్ నివారణ సాధ్యమని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తిని తగ్గించడానికి, ఆరోగ్యకరమైన ఎంపికలను ప్రోత్సహించడానికి ఐఈసీ ప్రచారం -2024 పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, డాక్టర్ స్పందన, రామచంద్ర, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి

» స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి వినతిపత్రం



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు

నర్సీపట్నం, సెప్టెంబరు 12: సచివాలయాల ఏఎన్ఎంలకు ఇంటెన్సిఫైడ్ జీఎన్ఎం పేరుతో 18 నెలలపాటు శిక్షణ ఇచ్చి పర్మనెంట్ స్టాఫ్ నర్సులుగా నియామకాలు చేయపట్టడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు పేర్కొన్నారు. గురువారం ప్రాంతీయ ఆస్పత్రి వద్ద ధర్నా చేశారు. అనంతరం ర్యాలీగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు నివాసానికి, సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు మాట్లాడుతూ, జీవో 115 వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో 15 సంవత్సరాలుగా కాంట్రాక్టు విధానంలో స్టాఫ్ నర్సులుగా చేస్తున్న తమకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. తక్షణమే జీవోను రద్దు చేయాలని, తమను రెగ్యులర్ చేయాలని కోరారు. దీంతో స్పందించిన అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుతో మాట్లాడారు. అమరావతి వెళ్లి కృష్ణబాబుని కలవాలని కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల యూనియన్ నాయకులకు ఆయన సూచించారు.

మహిళ గల్లంతుపై సీఐ విచారణ



గల్లంతైన మహిళ కుటుంబీకులను విచారిస్తున్న సీఐ కోటేశ్వరరావు.

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 12: వడ్డాది వద్ద పెద్దేరు నదిలో మహిళ గల్లంతు అయిన సంఘటనపై కొత్తకోట సీఐ కోటేశ్వరరావు గురువారం విచారణ చేపట్టారు. మంగళవారం రాత్రి కస్పా కాలువ గట్టుపై తన సోదరి బద్దీ విజయలక్ష్మితో కలసి బహిర్భూమికి వెళ్లిన జనపరెడ్డి సుబ్బలక్ష్మి ప్రమాదశాత్తూ కాలు జారి పెద్దేరులో పడి గలంతైన విషయం విదితమే. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ కోటేశ్వరరావు గురువారం ఇక్కడకు వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విజయలక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాలింపు చర్యలు ముమ్మరం చేస్తామని సీఐ తెలిపారు. కాగా పెద్దేరులో గల్లంతైన సుబ్బలక్ష్మి చీరను వడ్డాది సంతబయలు దిగువ ప్రాంతంలోని తుప్పల్లో కనుగొన్నారు. సుబ్బలక్ష్మి ఆచూకీ కోసం ఈతగాళ్లు రెండు రోజుల నుంచి పెద్దేరు నదిలో వడ్డాది నుంచి గౌరీపట్నం వరకు గాలిస్తున్నారు. గురువారం సాయంత్రం వరకు ఫలితం లేకపోయింది.

రోడ్ల మరమ్మతుకు టెండర్లు: ఏపీఐఐసీ జడ్ఎం

అచ్యుతాపురం, సెప్టెంబరు 12: సెజ్ పరిధిలో రోడ్ల మరమ్మతుకు టెండర్లు ఆహ్వానించామని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.హరిప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. 'భారీ వర్షాలతో రోడ్లు ఛిద్రం' శీర్షికతో ఈనెల 11న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఏపీఐఐసీ పరిధిలోగల రోడ్ల మరమ్మతులపై ఇటీవల ఐలాలో జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో చర్చించామన్నారు. గోతులను గత జూలైలో వెట్ మిక్స్ మెకడమ్‌తో పూడ్చామన్నారు. రోడ్డు మరమ్మతులు, నిర్వహణ పనులు ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా జరుగుతుందన్నారు. ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల ఐదున టెండర్లు పిలిచారని, ఎస్ఈజడ్‌లోని రోడ్లకు రూ.2.95 కోట్లు, డీనోటిఫైడ్ రోడ్లకు రూ.4.9 కోట్లు ఐలాలో డిపాజిట్ చేశామని, 29న టెండర్లు తెరుస్తామన్నారు.

కవులు, కళాకారులకు నిలయం అనకాపల్లి



కవితా సంపుటిని ఆవిష్కరించిన దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12 : అనకాపల్లి జిల్లా కవులు, కళాకారులకు నిలయమని, అటువంటి జిల్లాలో నూతనంగా అభ్యుదయ రచయితల సంఘం ప్రమాణ స్వీకారం చేయడం అభినందనీయమని అరసం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జీఎస్ చలం, వల్లూరి శివప్రసాద్ పేర్కొన్నారు. అరసం మహాసభ బుధవారం రాత్రి శాఖా గ్రంథాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన చలం, ప్రసాద్‌లు మాట్లాడుతూ ఈ సంఘంలో యువత కూడా ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ఈ సంఘాన్ని ముందు తరాల వారికి మార్గదర్శకంగా ఉండేలా కృషి చేయాలన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన తెలుగుభాష సంఘం అధ్యక్షుడు కె. రామ్మోహన రావు మాట్లాడుతూ జిల్లాలో అరసం సంఘం కార్యవర్గం ఏర్పాటు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత గరిమెళ్ల సత్యనారాయణ రచించిన కవితా స్రవంతి పుస్తకాన్ని ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెనుగొండ లక్ష్మీనారాయణ, గ్రంథాలయాధికారి కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అరసం కమిటీ

అనకాపల్లి జిల్లా అరసం నూతన కమిటీ అధ్యక్షుడిగా జీఎల్ఎన్ శాస్త్రి, కార్యవర్గసభ్యులుగా బల్లా నాగభూషణం, పెతకంశెట్టి ఆదికోటి, పెనుమత్స కృష్ణంరాజు, బొమ్మాడ నరసింహారావు, జీఎస్‌కే సాయిబాబా, గంపా శ్రీదేవి, డాక్టర్ జామి అప్పలరాజు, శిష్టా ప్రకాష్, ఎం. వెంకటరమణమ్మ, కనుమూరి హైమా, రాయవరపు సరస్వతి, గౌరవాధ్యక్షులుగా గెల్లా జయబాబు నియమితులయ్యారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు చోడిశెట్టికి ఘన సన్మానం


చోడిశెట్టి సత్యనారాయణను సత్కరిస్తున్న విద్యాశాఖాధికారులు,ఉపాధ్యాయులు

నక్కపల్లి, సెప్టెంబరు 12: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పెద బోదిగల్లం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం చోడిశెట్టి సత్యనారాయణ దంపతులను గురువారం ఘనంగా సత్కరించారు. ఎంఈవో కె.నరేశ్, నోడల్ హెచ్ఎం వేమగిరి నూకరాజు, సర్పంచ్ మున్నీషాబేగం, గ్రామ పెద్ద రజాక్, జాతీయ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు శ్రీపాద సత్యదేవ శర్మ, ఎన్‌వీఎస్ ఆచార్యులు చోడిశెట్టి దంపతులను దుశ్శాలువలతో సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో 95 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పరవాడ, సెప్టెంబరు 12 : రాంకీ ఫౌండేషన్, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ ఫార్మాసిటీ సహకారంతో తాడి గ్రామంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు ప్రారంభించారు. ఈ శిబిరంలో వైద్యులు 95 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 16 మందికి కంటి ఆపరేషన్ చేయడానికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్. గిరిధరబక్షి, లైజినింగ్ ఆఫీసర్ రాఘవరెడ్డి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

326వ రోజుకు చేరుకున్న పెదకలవలాపల్లి రైతుల నిరసన

రాంబిల్లి, సెప్టెంబరు 12 : తమ గ్రామం చుట్టూ నేవీ ప్రహరీ ఏర్పాటు చేయడం ద్వారా తీవ్రంగా నష్టపోయామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని పెదకలవలాపల్లి రైతులు చేస్తున్న నిరసన గురువారానికి 326వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యుడు రావి దేముళ్లు మాట్లాడుతూ ప్రహరీ ఏర్పాటుతో గ్రామమంతా అన్నివిధాల నష్టపోతుందన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా అధికారులు, పాలకులు కనీసం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. తమకు న్యాయం జరిగేంతవరకు శాంతియుత నిరసనను ఆపేది లేదని దేముళ్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ మహిళా రైతులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ అమ్మవారి పండగ

▸▸ **దర్శించుకున్న పలువురు ప్రజాప్రతినిధులు**


మరిడిమాంబను దర్శించుకుంటున్న కొణతాల

కశింకోట, సెప్టెంబరు 12: మండలంలోని జి.భీమవరంలో మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వీరిని ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు.

బస్టాండ్ ఆక్రమణలు తొలగించాలి : వైసీపీ నేతలు


ఇన్‌చార్జి కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నేతలు

ఎలమంచిలి, సెప్టెంబరు 12: ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆక్రమణలు తొలగించి, బస్సుల రాకపోకలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్‌కు ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తా, పలువురు కౌన్సిలర్లు, వైసీపీ నేతలు వినతిపత్రం అందజేశారు. బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేందుకు ఆటంకం ఉందన్న పేరుతో వైఎస్సార్ విగ్రహం వద్ద దిమ్మను సగభాగం తొలగించిన అధికారులు ఆక్రమణలను తొలగించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, నేతలు, కౌన్సిలర్లు దాసరి కుమార్, రాపేటి సంతోష్, దూది నరసింహామూర్తి, గొర్లె వెంకట్, బీబీ, రమణ, పిట్టా సత్తిబాబులు పాల్గొన్నారు.

మునిసిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

▸▸ **పోలీసులకు ఫిర్యాదు చేసిన కూటమి నాయకులు**


సీఐకు ఫిర్యాదు చేస్తున్న కూటమి నేతలు బొద్దపు శ్రీను, నక్కా శివ, నానాజీలు

ఎలమంచిలి, సెప్టెంబరు 12: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల వైఎస్సార్ విగ్రహం దిమ్మ తొలగింపులో మునిసిపల్ అధికారులు ఒక పార్టీకి కొమ్ము కాస్తున్నారని, ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం కూటమి నేతలు పట్టణ సీఐ ధనుంజయరావు, ఎస్‌ఐ సావిత్రిలకు ఫిర్యాదు చేశారు. అనంతరం కూటమి నేతలు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, కొఠారు సాంబ, నక్కా శివ, ఝాన్సీ, కొఠారు నరేష్, కొఠారు శ్రీను మాట్లాడుతూ బస్టాండ్‌లోకి ఎక్స్‌ప్రెస్‌లు వచ్చేందుకు అడ్డంకిగా ఉన్న విగ్రహం వద్ద దిమ్మను తొలగించడంలో మునిసిపల్ అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బొద్దపు శ్రీనివాసరావు(రమణ), నమ్మి రమణ, పల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు టీడీపీ నాయకులు చేయూత



నక్కపల్లి,సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితులకు పాయకరావుపేట నియోజకవర్గ టీడీపీ నాయకులు గురువారం నిత్యావసర సరకులు, దుప్పట్లు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. పార్టీ నాయకులు పలువురు వాన్‌పై పలు సరుకులను విజయవాడ రాజరాజేశ్వరినగర్‌లో వరద బాధితులకు హోం మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా పంపిణీ చేశారు. వారిని హోం మంత్రి అభినందించారు. టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, వైబోయిన రమణ, పెదిరెడ్డి చిట్టిబాబు, జానకి శ్రీను, గింజాల లక్ష్మణరావు, దేవర సత్యనారాయణ, గొనగాల రామకృష్ణ, మేరుగు నాగేశ్వరరావు, దార్ల కృష్ణ, అల్లు నర్సింహమూర్తి, రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న అనిత, టీడీపీ నేతలు

సీతారాం ఏచూరికి నివాళి


ఎలమంచిలిలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

కశింకోట, సెప్టెంబరు 12 : సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి కశింకోటలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు దాకారపు శ్రీనివాసరావు, డీడీవరలక్ష్మి, ఆర్.అమ్మాజీ తదితరులు ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన జీవిత ఆశయాలను సాధించడమే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు.

ఎలమంచిలిలో..

ఢిల్లీలో మృతి చెందిన సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద ఆ పార్టీ నేతలు, సీఐటీయూ జిల్లా కమిటీ నేతలు, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ప్రతినిధులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఏచూరి సేవలను పలువురు నేతలు కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ కర్రి అప్పారావు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుల సీహెచ్ శివాజీ, మణికంఠ, సీహెచ్. రామకృష్ణ, శ్రీనివాస్, రామారావు, కేశవ పాల్గొన్నారు. అదేవిధంగా సీతారాం ఏచూరి మృతికి ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు గనిశెట్టి ఏసుదాసు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ప్రాథమిక విద్యకు పూర్వ వైభవం తేవాలి : ఏపీటీఎఫ్


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు వెంకటపతిరాజు, సంఘ ప్రతినిధులు

ఎలమంచిలి, సెప్టెంబరు 12: రాష్ట్ర ప్రభుత్వం జీవో 117ను రద్దు చేసి, ప్రాథమిక విద్యకు పూర్వ వైభవం తేవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వెంకటపతిరాజు, జిల్లా అధ్యక్షుడు కర్రి ధర్మారావు కోరారు. గురువారం వారు మండలంలోని పులపర్తితోపాటు పలు హైస్కూళ్లను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. జీవో117తో ప్రాథమిక విద్య పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ రద్దు చేసి ఎస్‌ఈఆర్‌టీసీ సిలబస్ అమలు చేయాలన్నారు. తెలుగు ఆంగ్ల మాధ్యమాలను సమాంతరంగా నడపాలని, ఓపీఎస్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ జిల్లా ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పట్టా వరలక్ష్మిని ఏపీటీఎఫ్ సభ్యులంతా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేటి సత్యనారాయణ, మల్లిపాటి సత్యనారాయణ, పి. అప్పారావు, జి. సర్వేశ్వరావు, పి. శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

జీఓ 85 రద్దు చేయాలని కోరుతూ వైద్యులు ఆందోళన

పాయకరావుపేట, సెప్టెంబరు 12 : జీవో 85కి వ్యతిరేకంగా పీహెచ్‌సీ వైద్యులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సుభాష్ మాట్లాడుతూ.. ఈ జీవో ద్వారా తమ మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోయిందని, జీవోను మార్చడం అన్యాయమన్నారు. రెండు నెలలుగా జీవో 85 రద్దు చేయమని అధికారులకు, శాసనసభ్యులకు అర్జీలు సమర్పించినప్పటికీ ఇప్పటి వరకు ఎటువంటి సమాధానం రాలేదన్నారు. ఈ నెల పదో తేదీ నుంచి వివిధ రీతుల్లో ఆందోళనను చేస్తున్నట్టు చెప్పారు. 13వ తేదీ ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించకుంటే అత్యవసర సర్వీసులను మినహాయించి అన్ని రిపోర్టింగ్‌లు, వీసీ, టీసీ, అధికారిక కమ్యూనికేషన్‌లు నిలిపివేస్తారన్నారు. 14వ తేదీ పీహెచ్‌సీ సేవలు కేవలం అత్యవసర వైద్య సేవలకు మాత్రమే పరిమితం చేస్తామన్నారు.

15వ తేదీ చలో విజయవాడ ర్యాలీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద జరుగుతుందన్నారు. 16వ తేదీ జీవో 85 రద్దు వరకు నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభం అవుతుందన్నారు.

మృతి చెందిన వైసీపీ కార్యకర్తల జాబితా ఇవ్వాలి : బుద్ద

కొత్తూరు, సెప్టెంబరు 12 : మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మృతి చెందిన 36 మంది వైసీపీ కార్యకర్తల జాబితాను ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బుడమేరు వరదల్లో 60 మంది మృతి చెందారని జగన్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. నిత్య అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా పేరొందిన జగన్ కష్టాల్లో ఉన్న ప్రజలను పట్టించుకోకుండా జైలు యాత్రలు చేయడం సిగ్గుచేటన్నారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. సమావేశంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, ఉపాధ్యక్షుడు బోడి వెంకట్రావు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితుల పట్ల ఆప్యాయత కలిగి ఉండాలి : డీఎంహెచ్‌ఓ



ర్యాలీ ప్రారంభించిన డీఎంహెచ్‌ఓ బాలాజీ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12 : హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితుల పట్ల ప్రేమ, ఆప్యాయత కలిగి ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎంఎస్‌వీకే బాలాజీ పేర్కొన్నారు. స్థానిక బైపాస్ జంక్షన్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులచే గురువారం 5కె రెడ్ రిబ్బన్ రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ సోకిన వారిలో నియంత్రించేందుకు కలిసికట్టుగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎయిడ్స్ నియంత్రణ, నిర్మూలన సంస్థ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ రామచందర్, డాక్టర్ స్పందన, ట్రాఫిక్ సీఐ ఎం. వెంకట నారాయణ, ఎస్‌వీడీఎస్ సిబ్బంది గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు రవిబాబుకు ఘన సన్మానం


జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు బీపీ.రవిబాబును సన్మానిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు12: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బి.పద్మజా రవి బాబును గురువారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కేఎన్ గాంధీ, ఉపాధ్యాయులు వై.ఆనందరావు, కట్టా శ్రీను, చిరంజీవి, సింహాచలం, వరప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఉత్తమ గురువు ధర్మారావుకు సన్మానం

ఎస్.రాయవరం, సెప్టెంబరు 12: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు కర్రి ధర్మారావును గురువారం తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ, గ్రామ పెద్దలు, టీడీపీ, జనసేన నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దివానం, టీడీపీ నాయకులు గుర్రం రామకృష్ణ, కె.చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ వంగలపూడి గోవింద్, జనసేన నాయకులు పప్పల శివ, సేనాపతి బాబూరావు, విశ్రాంత సింహాచలం పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో అన్నసమారాధన

ఎస్. రాయవరం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద గురువారం మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, వైసీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, వైసీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12 : పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వైర్లపై వేలాడుతున్న చెట్లకొమ్మలను తొలగించడంలో భాగంగా శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గుండాల జంక్షన్, సాయినగర్, లక్ష్మీదేవిపేట, మిరియాలకాలనీ, పాత్రుడుకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పరవాడలో..

వాడచీపురుపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, దోసూరు, నునపర్తి పంచాయతీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

ఎలమంచిలిలో..

మండలంలో పలు సబ్ స్టేషన్ల పరిధిలో చేస్తున్న లైన్ల నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ ఏఈ రాజశేఖర్ తెలిపారు. మండలంలోని పులపర్తి, లక్కవరం, విశాఖ బయో మెరైన్, పెదషేకిళ్లపాలెం, చినషేకిళ్లపాలెం, కొక్కిరాపల్లి, తండాలదిబ్బ, మెలిపాక, యాదగిరి పాలెం, జంపపాలెం, తురంగల పాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అదృశ్యమైన ఫార్మా ఉద్యోగి మృతి

... 5వ పేజీ తరువాయి

ఈ ట్యాంకు సుమారు 15 అడుగుల ఎత్తు వుంది. ట్యాంకులో కొంతమేర మిథనాల్ ఉండడంతో మృతదేహాన్ని బయటకు తీయడానికి వీలు కాలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బంది మిథనాల్ ట్యాంకులోకి నీరు నింపి, సూర్యనారాయణ మృతదేహాన్ని పైకి తేలేలా చేసి బయటకు తీశారు. బుధవారం ఉదయమే మిథనాల్ ట్యాంక్‌ను పరిశీలించినట్టయితే సూర్యనారాయణ ఆచూకీ లభించేదని, కానీ యాజమాన్యం ఆ ట్యాంకును ఎందుకు పరిశీలించలేదో అర్థం కావడం లేదని మృతుడి కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మృతుడి కుటుంబీకులు ఆందోళన

యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే సూర్యనారాయణ ప్రాణాలు కోల్పోయాడని, అందువల్ల బాధిత కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కుటుంబీకులు, బంధువులు పరిశ్రమ ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు గురువారం దిగారు. సుమారు 15 అడుగుల ఎత్తులో ఉన్న మిథనాల్ ట్యాంక్ పైకి వెళుతున్న విషయం యాజమాన్యం గుర్తించకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నదన్నారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించేందుకు పోలీసులు సిద్ధమవుతుండగా బంధువులు అడ్డుకున్నారు. కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లిస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ఆందోళన కొనసాగింది. నష్టపరిహారం విషయమై జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాదంశెట్టి నీలబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బుగిడి రామగోవిందరావు, తదితరులు పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపారు.

రూ.50 లక్షలు నష్టపరిహారం

వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో మృతుడి కుటుంబ సభ్యులు, పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులకు మధ్య చర్చలు జరిగాయి. రూ.50 లక్షలు నష్టపరిహారంతోపాటు దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం మరో లక్ష రూపాయలు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. అనంతరం సూర్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కాగా సూర్యనారాయణకు భార్య బాల పరమేశ్వరి, కుమార్తె జ్యోషిత, కుమారుడు సృజన్ ఉన్నారు. ఇతని స్వస్థలం విజయనగరం జిల్లా వేపాడ మండలం వీలుపర్తి గ్రామం. ఉద్యోగం నిమిత్తం కుటుంబంతో కలిసి గాజువాకలో నివాసం వుంటున్నాడు.

ప్రమాదమా? ఆత్మహత్యా?

విధి నిర్వహణలో భాగంగా సూర్యనారాయణ మిథనాల్ ట్యాంకు పైకి ఎక్కి ప్రమాదవశాత్తూ కాలు జారి లోపలపడి మృతి చెందాడా? లేకపోతే ఆత్మహత్య చేసుకున్నాడా? అన్నది ఇంకా నిర్ధారణ కాలేదు. మంగళవారం సాయంత్రం ఐదు గంటల తర్వాతే సూర్యనారాయణ మృతిచెంది ఉండొచ్చనని పోలీసులు భావిస్తున్నారు. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆయన పర్యవేక్షణలో సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు చంద్రబాబు సేవలు చారిత్రాత్మకం : పప్పల


సమావేశంలో మాట్లాడుతున్న పప్పల చలపతిరావు

ఎలమంచిలి, సెప్టెంబరు 12 : తుఫాన్ కారణంగా అతలాకుతలమైన విజయవాడ వరద బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు అందించిన సేవలు చారిత్రాత్మకమని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు కొనియాడారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. చంద్రబాబు వరద బాధితులకు అన్ని విధాలా దగ్గరుండి అందించిన భరోసా వైసీపీ నేతలకు కనిపించలేదా అని ఆయన ప్రశ్నించారు. గతంలో విపత్తుల సమయంలో వైసీపీ అధినేత కనీసం పరిశీలనకు కూడా వచ్చిన దాఖలాలు లేవన్నారు. అటువంటిది చంద్రబాబు స్వయంగా వరదల సమయంలో వీధుల్లో తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని, అందుకు అనుగుణంగా సేవలందించారన్నారు. పార్టీ నేతలు కొఠారు సాంబ, గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను, మజ్జి రామకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వరస్వామి కల్యాణం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12 : స్థానిక గవరపాలెం సంతబయలు పెదరామస్వామి కల్యాణ మండపంలో గురువారం వెంకటేశ్వరస్వామి కల్యాణ వ్రత మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఓం శాంతి గవరపాలెం బ్రాంచ్ బీకే సత్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సతీమణి పద్మావతి, టీడీపీ నాయకుడు మళ్ల సురేంద్ర ప్రారంభించారు. 300 మంది దంపతులు ఈ వ్రత మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఓంశాంతి బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12: విద్యార్థులందరికీ రుచికరమైన భోజనాన్ని అందించాలని ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక గాంధీనగరం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ప్రధానంగా మధ్యాహ్న భోజన పథకం గురించి, వివిధ అంశాల గురించి చర్చించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్యాబోధన జరుగుతుందని ఎస్ఎంసీ చైర్మన్ సాలాపు సంధ్య, సభ్యులు ప్రధానోపాధ్యాయుడును కొనియాడారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాల పంపిణీ చేశారు.

కొత్తపేటను నేవీ ప్రభావిత గ్రామంగా గుర్తించాలి

రాంబిల్లి, సెప్టెంబరు 12 : మండలంలోని కొత్తపేటను నేవీ ప్రభావిత గ్రామంగా గుర్తించి గ్రామస్థులకు న్యాయం చేయాలని సర్పంచ్ వానపల్లి వెంకట అరుణలత గ్రామస్థులతో కలిసి గురువారం అచ్యుతాపురంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నేవీ ప్యాకేజీతోపాటు ఉపాధి కల్పించాలన్నారు. పైడితల్లి అమ్మవారు ఆలయాన్ని ఆనుకొని ఉన్న పైడమ్మ ట్యాంక్‌ను గ్రామానికి కేటాయించాలని, పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. తమ వినతిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు జగన్, పి.బాబూరావు పాల్గొన్నారు.

జనసైనికుల ఉదారత

▸▸ **శీనయ్యపాలెంలో తాగునీటి సరఫరా**


ట్యాంకర్ ద్వారా మంచినీరందిస్తున్న జనసైనికులు

నక్కపల్లి,సెప్టెంబరు 12: మండలంలోని ఉపమాక శివారు శీనయ్యపాలెంలో గురువారం జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్, పార్టీ నాయకులు కురందాసు అప్పలరాజు, పాము గణేశ్, యలమంచిలి చంద్రరావు, పిక్కి స్వామి ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా శివదత్ మాట్లాడుతూ జనవాణి కార్యక్రమంలో ఇప్పటి వరకూ 50 ఫిర్యాదులు రాగా, వాటిలో 30 సమస్యలను పరిష్కరించామని చెప్పారు. కార్యక్రమంలో జనసైనికులు బంగారి రాజు, సుంకర సాయి, రాజా, చిన్న, శ్రీను, లోవ రాజు పాల్గొన్నారు.

ఎంఈవో-2గా వేమగిరి నియామకం

నక్కపల్లి, సెప్టెంబరు 12: మండల ఎంఈవో-2గా వేమగిరి నూకరాజు నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన దేవవరం హెచ్ఎంగా పనిచేస్తున్నారు. ఈనెల 13వ తేదీన ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నిరసన

నక్కపల్లి, సెప్టెంబరు 12: రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక సీహెచ్‌సీలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు గురువారం ఆందోళన చేశారు. కొత్తగా వచ్చిన 115 జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్లుగా పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.వరలక్ష్మి, కావేరి, జీవన జ్యోతి, వనజ, వరలక్ష్మి, కుమారి, నూకరత్నం, కృష్ణవేణి, అప్పలనర్స, ఇమామ్ పాల్గొన్నారు.

సిద్ధి వినాయకున్ని దర్శించుకున్న రత్నాకర్


వినాయకున్ని దర్శించుకుంటున్న రత్నాకర్

కొత్తూరు, సెప్టెంబరు 12 : మండలంలోని పిసినికాడ సీతారాముల ఆలయంలో నిర్వహిస్తున్న నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం విఘ్నేశ్వరున్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంఈవో-2గా సత్తిబాబు బాధ్యతలు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 12: మండల ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి-2 గా బి. సత్తిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంఈవో-2గా ఇక్కడ విధులు నిర్వహించిన ఏఎస్ఎస్ఏఎస్ మూర్తి పదవీ విరమణ పొందడంతో చినగుమ్ములూరు హైస్కూల్ హెచ్ఎం సత్తిబాబు ఇన్‌చార్జి ఎంఈవో-2గా నియమించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జి ఎంఈవో సత్తిబాబును డిప్యూటీ డీఈవో పి. అప్పారావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కర్రి ధర్మారావు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య నిర్వహణ



పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్, పంచాయతీ సిబ్బంది

కృష్ణాదేవి పేట, సెప్టెంబరు 12 : గొలుగొండ మండలం సీహెచ్ నాగాపురంలో గురువారం పలువీధులో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టారు. గొలుగొండ ఈవోపీఆర్డీ జి.రమణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పనులను పర్యవేక్షించారు. నెలల తరబడి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యలమంచిలి రఘురామ్‌చంద్రరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చింతకాయల వరహాలదొరకు నివాళి



వరహాల దొరకు నివాళులు అర్పిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 12 : చింతకాయల వరహాల దొర 51వ వర్ధంతి సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. గురువారం ఏపీ అసెంబ్లీ స్పీకర్ సభాపతి, ఆయన భార్య పద్మావతి, కుటుంబ సభ్యులు వరహాలదొర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీసీ కాలనీలో టీడీపీ నాయకుడు లాలం మురళీకృష్ణ ఆధ్వర్యంలో వరహాల దొర విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీనారిపాలెం, బీసీ కాలనీ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై దిగబడిన లారీ



రోడ్డుకు అడ్డంగా ఇరుక్కుపోయిన లారీ

నాతవరం, సెప్టెంబరు 12 : నాతవరం మండలం తుని-నర్సీపట్నం మార్గంలోని గన్నవరం సమీపంలో లోడుతో వెళుతున్న లారీ భూమిలో కూరుకుపోయింది. గంటపాటు లారీ దిగబడి బయటకు రాకపోవడంతో రెండు వైపుల రాకపోకలు సాగించే వాహనాలు కిలోమీటర్లు మేర నిలిచిపోయాయి. ట్రాఫిక్ జమ్ కావడంతో తుని రైల్వేస్టేషన్ నుంచి రైలుకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. లారీ యాజమాని ఎక్సకవేటర్ రప్పించి భూమిలో దిగిపోయిన లారీని బయటకు తీయించారు. దీంతో వాహనాలు కదిలాయి. ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

బస్సులు రాక ప్రయాణికులకు ఇబ్బందులు

మాడుగుల, సెప్టెంబరు 12: మాడుగుల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చోడవరం వెళ్లే మార్గంలో పేట వద్ద డైవర్షన్ రోడ్డు వర్షాలకు కొట్టుకుపోవడంతో బస్సు సర్వీసులను చీడికాడ, అప్పలరాజుపురం వయా కేజే.పురం మీదుగా రాకపోకలు జరుగు తున్నాయి. అలాగే కోడూరు వద్ద కూడా మార్గమధ్యంలో రోడ్డు పనులు చేపట్టడంతో అటు పాడేరు నుంచి ఇటు అనకాపల్లి, విశాఖ నుంచి మాడుగుల బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రయాణికుల అవస్థలు దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు మాడుగులకు బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాలలో మౌలిక సదుపాయాల పరిశీలన

దేవరాపల్లి, సెప్టెంబరు 12: మండలంలోని ముషిడిపల్లి, కేఎం.పాలెం గ్రామాల్లో పాఠశాలలు, సచివాలయాల్లో మౌలిక సదుపాయలను ఎంపీడీఓ చంద్రశేఖర్ గురువారం పరిశీలించారు. ముషిడిపల్లిలో పాఠశాల వంట గదులు, సదుపాయలు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కేఎం.పాలెం సంపద కేంద్రాలను పరిశీలించారు. అలాగే సచివాలయ రికార్డులను పరిశీలించారు.

వినాయకుడికి 20 కిలోల లడ్డు వితరణ

దేవరాపల్లి, సెప్టెంబరు 12: మండలంలోని నాగయ్యపేటలో వినాయకుడి నవరాత్రులలో భాగంగా 20 కిలో లడ్డును దాసరి అర్జున, నాగమణి దంపతులు గురువారం గ్రామస్థులకు అందజేశారు. అలాగే ఈనెల 15న అన్నసమారాధన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

దిబ్బిడి ఎంపీటీసీ మాజీ సభ్యుడు తాతబాబు మృతి



బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 12: దిబ్బిడి ఎంపీటీసీ మాజీ సభ్యుడు సింయాద్రి తాతబాబు బుధవారం రాత్రి స్వగృహంలో మృతి చెందారు. కొంత కాలంగా తాతబాబు అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పరామర్శించి, సానుభూతి తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, దొండా నారాయణమూర్తి, సత్యనారాయణ, దొండా అచ్చెయ్యదొర తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సస్యరక్షణతో వరిలో ఆకుముడత పురుగు నివారణ

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 12: సస్యరక్షణతో వరిలో ఆకుముడత పురుగును నివారించవచ్చునని ఏవో భాస్కరరావు రైతులకు సూచించారు. గురువారం దిబ్బిడి, బుచ్చెయ్యపేట గ్రామాల్లో వరి పంటలను ఆయన పరిశీలించారు. పంటకు ఆకుముడత పురుగు ఆశించినట్టు గుర్తించారు. దీని నివారణకు ఎకరం పొలంలో 20 పక్షిస్థావరాలు ఏర్పాటు చేయాలన్నారు. పురుగు ఉధృతంగా ఉంటే తొలి దశలో నియంత్రణకు రెండు గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్‌ను లీటరు నీటికి చొప్పున కలిపి (ఎకరాకు 400 గ్రాములు) పిచ్చికారీ చేయాలన్నారు. దీర్ఘకాలిక నియంత్రణకు ఫ్లైబెండమైడ్ 20 డబ్ల్యూడిజీ మందు 0.25 గ్రాములు లీటరు నీటిలో కలిపి (ఎకరాకు 50 గ్రాములు) పిచ్చికారీ చేస్తే నియంత్రణలోకి వస్తుందని భాస్కరరావు తెలిపారు.

కుసర్లపూడి హైస్కూల్‌కు ప్రహరీ నిర్మించండి



ఎమ్మెల్యే రాజుకు వినతిపత్రం అందిస్తున్న ఈశ్వరరావు

రోలుగుంట, సెప్టెంబరు 12 : మండలంలోని కుసర్లపూడి జడ్పీ పాఠశాలకు ప్రహరీకి నిధులు మంజూరు చేయాలని గురువారం ఎమ్మెల్యే రాజుకు బీజేపీ మండల ఉపాధ్యక్షుడు పచ్చిగొళ్ల ఈశ్వరరావు వినతిపత్రం అందించారు. ప్రహరీ లేకపోవడంతో పశువులు స్కూల్ ఆవరణలోకి ప్రవేశిస్తున్నాయని, అలాగే రాత్రి సమయాల్లో పాఠశాలలో విలువైన వస్తువులు అపహరణకు గురవుతున్నాయన్నారు. ఈ సమస్యను ఇప్పటికే విద్యాశాఖ అధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లామని తెలిపారు.

జి.కోడూరు పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ

» నాలుగు వారాల గడువు కావాలంటూ సర్పంచ్ వినతి



విచారణకు హజరైన సర్పంచ్ అమ్మాజీ

మాకవరపాలెం, సెప్టెంబరు 12 : మండలంలోని జి.కోడూరు పంచాయతీలో నిధులు పక్కదారి పట్టాయంటూ అందిన ఫిర్యాదుపై గురువారం మూడోసారి విచారణ చేపట్టారు. జి.కోడూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మళ్ల జగన్నాథం ఈ పంచాయతీలో నిధుల వినియోగానికి సంబంధించి అవకతవకలు జరిగాయంటూ ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పటికే రెండుసార్లు సబ్బవరం ఈవోపీఆర్డీ మహేష్, మాకవరపాలెం ఎంపీడీవో సీతామహాలక్ష్మి విచారణ చేపట్టారు. అయితే రెండుసార్లూ సర్పంచ్ బొడ్డేటి అమ్మాజీ గురువారం హాజరయ్యారు. అనారోగ్య కారణంగా గతంలో రాలేకపోయానంటూ వివరణ ఇచ్చారు. అయితే గురువారం చేపట్టిన విచారణకు వచ్చిన ఆమె ప్రస్తుతం అనారోగ్యం కారణంగా మాట్లాడలేని పరిస్థితి ఉన్నానని, నాలుగు వారాల గడువు కావాలని సర్పంచ్ విచారణ అధికారులకు లిఖిత పూర్వకంగా కోరారు. దీంతో విచారణాధికారులు నాలుగు వారాల తర్వాత విచారణకు సమ్మతించారు. అప్పటికీ సర్పంచ్ గైర్హాజరైతే రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బాక్సింగ్ రింగ్, ఇండోర్ హాల్ నిర్మాణం చేపట్టాలి

» మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్



నర్సీపట్నం, అక్టోబరు 12 : స్థానికంగా క్రీడాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని బాక్సింగ్ రింగ్, ఇండోర్ హాల్ నిర్మాణం చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని క్రీడాకారులు బాక్సింగ్, వూషూ, మార్షల్ ఆర్ట్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు వీరికి ప్రోత్సాహకరంగా మాత్రమే ఉండాలన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బాక్సింగ్ రింగ్, ఇండోర్ హాల్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ రూ.55,39,570లు నిధులు మంజూరు చేశారన్నారు. ఇప్పుడు బాక్సింగ్ రింగ్ నిర్మాణం ఆగిపోవడం, ఆ నిధులు ఇతర ప్రాజెక్ట్‌కు మళ్లిస్తే బాక్సింగ్ క్రీడాకారులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న స్కేటింగ్ రింక్ స్థలంలో నిర్మాణం చేయడం వీలు కాకుంటే నర్సీపట్నంలోనే మరో స్థలంలో బాక్సింగ్ రింగ్, ఇండోర్ హాల్ నిర్మాణం చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే కోరారు.

వరద బాధితులకు పొదుపు సంఘాల సహాయం



స్పీకర్ అయ్యన్నపాత్రుడికి చెక్ అందజేస్తున్న మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ సరోజిని

నర్సీపట్నం అర్బన్ , సెప్టెంబరు 12 : విజయవాడ వరద బాధితులకు స్థానిక పొదుపు సంఘాల సభ్యులు ముందుకు వచ్చారు. నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని 1420 పొదుపు సంఘాల నుంచి ఒక్కో సభ్యురాలు పది రూపాయల చొప్పున వితరణ చేశారు. ఈ మొత్తం రూ.2,72,540 సీఎం సహాయ నిధికి అందిస్తున్నట్టు తెలిపారు. గురువారం ఈ చెక్కును మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ సరోజిని చేతుల మీదుగా అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు సూర్యచంద్ర పాల్గొన్నారు.

అదృశ్యమైన ఫార్మా ఉద్యోగి మృతి

... 5వ పేజీ తరువాయి

ఈ ట్యాంకు సుమారు 15 అడుగుల ఎత్తు వుంది. ట్యాంకులో కొంతమేర మిథనాల్ ఉండడంతో మృతదేహాన్ని బయటకు తీయడానికి వీలు కాలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బంది మిథనాల్ ట్యాంకులోకి నీరు నింపి, సూర్యనారాయణ మృతదేహాన్ని పైకి తేలేలా చేసి బయటకు తీశారు. బుధవారం ఉదయమే మిథనాల్ ట్యాంక్‌ను పరిశీలించినట్టయితే సూర్యనారాయణ ఆచూకీ లభించేదని, కానీ యాజమాన్యం ఆ ట్యాంకును ఎందుకు పరిశీలించలేదో అర్థం కావడం లేదని మృతుడి కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మృతుడి కుటుంబీకులు ఆందోళన

యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే సూర్యనారాయణ ప్రాణాలు కోల్పోయాడని, అందువల్ల బాధిత కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కుటుంబీకులు, బంధువులు పరిశ్రమ ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు గురువారం దిగారు. సుమారు 15 అడుగుల ఎత్తులో ఉన్న మిథనాల్ ట్యాంక్ పైకి వెళుతున్న విషయం యాజమాన్యం గుర్తించకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నదన్నారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించేందుకు పోలీసులు సిద్ధమవుతుండగా బంధువులు అడ్డుకున్నారు. కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లిస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ఆందోళన కొనసాగింది. నష్టపరిహారం విషయమై జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాదంశెట్టి నీలబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బుగిడి రామగోవిందరావు, తదితరులు పరిశ్రమ యాజమాన్యంతో చర్చలుజరిపారు.

రూ.50 లక్షలు నష్టపరిహారం

వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో మృతుడి కుటుంబ సభ్యులు, పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులకు మధ్య చర్చలు జరిగాయి. రూ.50 లక్షలు నష్టపరిహారంతోపాటు దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం మరో లక్ష రూపాయలు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. అనంతరం సూర్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కాగా సూర్యనారాయణకు భార్య బాల పరమేశ్వరి, కుమార్తె జ్యోషిత, కుమారుడు సృజన్ ఉన్నారు. ఇతని స్వస్థలం విజయనగరం జిల్లా వేపాడ మండలం వీలుపర్తి గ్రామం. ఉద్యోగం నిమిత్తం కుటుంబంతో కలిసి గాజువాకలో నివాసం వుంటున్నాడు.

ప్రమాదమా? ఆత్మహత్యా?

విధి నిర్వహణలో భాగంగా సూర్యనారాయణ మిథనాల్ ట్యాంకు పైకి ఎక్కి ప్రమాదవశాత్తూ కాలు జారి లోపలపడి మృతి చెందాడా? లేకపోతే ఆత్మహత్య చేసుకున్నాడా? అన్నది ఇంకా నిర్ధారణ కాలేదు. మంగళవారం సాయంత్రం ఐదు గంటల తర్వాతే సూర్యనారాయణ మృతిచెంది ఉండొచ్చనని పోలీసులు భావిస్తున్నారు. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆయన పర్యవేక్షణలో సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్తంగా..

17న మండల సమావేశం

గొలుగొండ సెప్టెంబరు 12 : ఈ నెల 17న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డేవిడ్‌రాజ్ తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారిఅధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

జీవో 85పై వైద్యు నిరసన



నిరసన తెలుపుతున్న వైద్యులు

మాకవరపాలెం, సెప్టెంబరు 12 : ప్రభుత్వం విడుదల చేసిన 85 జీవోని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ ఈ జీవో వల్ల తమకు మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో మాకవరపాలెం,బూరుగుపాలెం పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.4 లక్షలు

నర్సీపట్నం, సెప్టెంబరు 12 : శ్రీదుర్గామల్లేశ్వర స్వామి హుండీ ఆదాయం 36 రోజులకు రూ.4,01,226 సమకూరినట్టు దేవదాయశాఖ ఈవో కె.దివ్యతేజ తెలిపారు. శుక్రవారం పర్యవేక్షణ అధికారి రాజ, వీఆర్వో, పోలీసుల సమక్షంలో ఆలయంలో హుండీ ఆదాయం లెక్కించారు..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాతవరం,సెప్టెంబరు 13 : నాతవరం మండలంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ చంద్రమౌళి తెలిపారు. కొత్త బ్రేకర్ నిర్మాణ పనులు చేపట్టడంతో మర్రిపాలెం, ములగపూడి, జిల్లేడిపూడి, చెర్లోపాలెం, వల్సంపేట చమ్మచింత, గుమ్మిడిగొండ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 12 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం, పాత కృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట, సీహెచ్ నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో గురువారం వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఏఎల్‌పురం హైస్కూల్, గొల్లవీధి, ఎస్టీ కాలనీ, పంచాయతీ కార్యాలయం వద్ద వినాయక మండపాల వద్ద అన్న సమారాధనలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఆయా కమిటీల నేతలు, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలి

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మండల ప్రత్యేక అధికారిణి నాగలక్ష్మి

కె.కోటపాడు, సెప్టెంబరు 12 : ప్రసవించే వరకు గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోషకాహార మాసోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను క్రమశిక్షణ చెప్పాల్సిన బాధ్యత కార్యకర్తపై ఉందన్నారు. చిన్నారులను పరిశుభ్ర వాతావరణంలో ఉంచాలని, వారికి వేడి వేడి పదార్థాలను తినిపించాలన్నారు. మండలంలో 14 అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరు చేయిస్తానన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి, సీడీపీవో మంగతాయారు, నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు, మాజీ ఎంపీపీ సబ్బవరపు పుష్పవతి, లెక్కల మల్లేశ్వరరావు, డోకల నరసింహమూర్తి, దాడి ఎరుకునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, జనసేన మండల అధ్యక్షుడు మాదిబోయిన సంతోష్, పూడి నారాయణమూర్తి, జూరెడ్డి రాము, బండారు నరసింహనాయుడు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి'



జేబీ పురం సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీలు

చీడికాడ, సెప్టెంబరు 12: గ్రామ పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో జయప్రకాశరావు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని జేబీ.పురం చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఈవోపీఆర్‌డీ ఎం.కామేశ్వరరావుతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. పరిసరాలను శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించడంతో వెంటనే పంచాయతీ కార్మికులు చుట్టూ ఉన్న చెత్తను, తుప్పలను శుభ్రంచేశారు. అలాగే గ్రామంలో డ్రైనేజీల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ప్రతిరోజు వాటర్‌ట్యాంకును క్లోరినేషన్ చేయించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ గొల్లవిల్లి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్ కార్మికుల రీకాల్‌పై కలెక్టర్‌కు కృతజ్ఞతలు



ఫ్యాక్టరీ ఆవరణలో కార్మికులతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నేతలు

చోడవరం, సెప్టెంబరు 12: గోవాడ షుగర్స్ కార్మికులను విధుల్లోకి తీసుకుంటూ ఫ్యాక్టరీ చైర్‌పర్సన్ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అనుమతి ఇవ్వడం పట్ల గోవాడ షుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శరగడం రామునాయుడు, రాయి సూరిబాబులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఫ్యాక్టరీలో కార్మికులతో మాట్లాడుతూ, కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఎమ్మెల్యే రాజు సూచన మేరకు ఇటీవల కలెక్టర్‌కు కలిసి విజ్ఞప్తి చేశామని, అందుకు ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. ఈ మేరకు గురువారం నుంచి కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకుంటూ యాజమాన్యం నిర్ణయం తీసుకోవడం పట్ల ఆయన కలెక్టర్‌కు, ఎమ్మెల్యే రాజుకు, కూటమి ప్రభుత్వానికి ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



'పౌష్టికాహారంతో తల్లీబిడ్డకు శ్రేయస్కరం'

దేవరాపల్లి, సెప్టెంబరు 12: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పౌష్టికాహారం సద్వినియోగం పర్చుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. గురువారం పోషకాహార మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది సూచనలు పాటించి, ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కోమలి, చిన్నమ్మలు, లక్ష్మి, ఏఎన్ఎం సత్యవతి, ఎంఎల్‌హెచ్‌పీ, మహిళా పోలీస్ పాల్గొన్నారు.

చలిసింగంలో 105 మందికి వైద్య పరీక్షలు



రోగులకు మందులు రాస్తున్న కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారిణి రజిని

రావికమతం,సెప్టెంబరు 12: మండలంలోని చలిసింగం గిరిజన గ్రామంలో కొత్తకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో 105 మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కొండపై ఉన్న ఆ గ్రామానికి కాలినడకన కొత్తకోట వైద్యాధికారిణి రజిని, సిబ్బంది వెళ్లి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీఎస్ జోషినిస్వరూప, హెల్త్ అసిస్టెంట్ నాయుడు, ఏఎన్ఎం ఉషారాణి, లక్ష్మణమ్మ పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీడికాడ, సెప్టెంబరు 12: ఈనెల 13వ తేదీన ఐదు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ నమ్మి వెంకటరావు తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ చీడికాడ, చుక్కపల్లి, చెట్టుపల్లి, నీలంపేట, తురువోలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి : దేవరాపల్లి-ఆనందపురం రోడ్డులో తొమ్మిది కిలోమీటర్లు మేర 33 కేవీ విద్యుత్ లైన్‌లో శుక్రవారం జంగిల్ క్లియరెన్స్ చేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఏఈఈ కర్రి శంకరరావు తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ పనులు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. అవసరమైనప్పుడు మధ్యలో సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు.

కె.కోటపాడులో..

కె.కోటపాడు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఏ.కోడూరు, ఏ.భీమవరం ఫీడర్లలో లైన్ మెయింటినెన్స్ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. ఈ ఫీడర్ల పరిధిలోని ఏ.కోడూరు, పొడుగుపాలెం, సింగన్నదొరపాలెం, సూరెడ్డిపాలెం, ఏ.భీమవరం, దాలివలస, మర్రివలస, పాతవలస, సూదివలస, శృంగవరం, గొట్లాం గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

బుచ్చెయ్యపేటలో..

బుచ్చెయ్యపేట: కశింకోట-బంగారుమెట్ట మెయిన్ లైన్ మరమ్మతుల కారణంగా రాజాం, బుచ్చెయ్యపేట విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వడ్డాది విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈఈ రాజు తెలిపారు. ఈ అంతరాయాన్ని గుర్తించి, తమకు సహకరించాలని ఆయన కోరారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం రూరల్ : మండలంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ వీడీవీ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నర్సీపట్నం మండలం ధర్మసాగరం, కోటవురట్ల మండలం అన్నవరం, ఎండపల్లి, మాకవరపాలెం మండలం వజ్రగడ, తమ్మయ్యపాలెం, చంద్రయ్యపాలెం, గంగవరం, మల్లవరం గ్రామాలలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఉపాధి పనులను పారదర్శకంగా ఆడిట్ చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్పీ నాగరాజు

రోలుగుంట, సెప్టెంబరు 12 : ఉపాధి హామీ తనిఖీలకు సంబంధింత శాఖ అధికారులు సహకరించాలని ఎస్ఆర్పీ నాగరాజు కోరారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంలో సోషల్ ఆడిట్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-2024 పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 24 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులపై తనిఖీలు పారదర్శకంగా చేపట్టాలని కోరారు. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు చేసిన పనులను బాధ్యతగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సూర్యమణి, పీఆర్ ఏఈ ఉమామహేశ్వరుడు, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.